సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

మంగళవారం 10-12-2024

సంపుటి: 20 సంచిక: 218

పేజీలు: 4 వెల: రూ.1

## 25వేల రకాల చీరలు ఒకేచోట ఉండటం అరుదు

- వారాహి సిల్క్స్ ప్రారంభించిన గొండు శంకర్ -



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

దేశవ్యాప్తంగా ఏయే రాష్ట్రాలు ఏ చీరలకు ప్రసిద్ధో, అక్కడి నుంచి సేకరించి జిల్లాలో ప్రీమియం చీరల షోరూమ్ ఏర్పాటుచేయడం గొప్ప విషయమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మంగళవారం స్థానిక పాలకొండ రోడ్డులో నూతనంగా ఏర్పాటుచేసిన వారాహి సిల్క్స్‌ను ఆయన ప్రారంభించారు. మూడంతస్తుల ఈ షోరూమ్‌లో అన్ని వర్గాల మహిళలకు చీరలు, డ్రస్ మెటీరియల్‌లు అందుబాటులో ఉంచడం ముదావహమన్నారు. పట్టు, ఫ్యాన్సీ కలిపి 25వేల రకాలు లభించే షోరూమ్ శ్రీకాకుళంలో మొట్టమొదటిగా ఏర్పడటం వల్ల విశాఖపట్నం వెళ్లే దూరాభారం తప్పిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో షాప్ యాజమాన్యం జె.ఎన్.ఆర్.కృష్ణ, ఆనందసాయి గ్రూప్స్ అధినేత కోరాడ గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.


# నేస్తమా..! నీ చిరునవ్వెక్కడ..!




మీ రూపం మా కళ్లెదుట ఉంది..
మీ మాటలు
మాకు వినిపిస్తునే ఉంటాయి..
మీ చెరగని చిరునవ్వుతో
మా మనసుల్లో చిరస్థాయిగా నిలిచిన
మీ మరణం మాకు తీరని లోటు..
మీరు లేరన్న వాస్తవం
మా గుండెల్ని పిండేస్తుంది..

స్నేహానికి, ప్రేమానురాగాలకు
నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన
మా మిత్రులు
గవిడి కౌశిక్, వద్ది అభినవ్,
వద్ది మణిమాల పవిత్ర ఆత్మలకు
శాంతి చేకూరాలని
ఆ భగవంతుని మనసారా ప్రార్థిస్తూ

- మీ స్నేహితులు

| | | | |
|---|---|---|---|
| జామి మణిదీప్ | కోరాడ గోపి | ఎ.సంతోష్ | ఎ.మణి |
| జి.అనిల్ | పి.నాని | జామి నవీన్ | టి.శరత్ |
| ఎస్.శ్రావణ్ | పి.క్రాంతి | పి.కామేష్ | కె.షన్ముఖ |
| బి.ప్రదీప్ | బి.మణికంఠ | కె.జస్వంత్ | శిల్లా వినీత్ |
| శిల్లా ప్రణీత్ | వసంత్ | జామి గౌతమ్ | జామి మనోహర్ |
| డి.చందు | పి.మణికంఠ | శరణ్‌గుప్త | కనకల భరత్ |

• ఎడిటోరియల్

## కూర్చున్న కొమ్మనే నరుక్కున్నారు..!

దేశవ్యాప్తంగా అత్యధిక థియేటర్లలో విడుదలై వసూళ్ల ప్రభంజనం సృష్టించిన రెండు భాగాల తెలుగు సినిమా 'బాహుబలి' - ఆ తర్వాత ఘనవిజయం సాధించిన ఏ తెలుగు సినిమా ఎంత వసూలు చేసినా అది 'నాన్ బాహుబలి రికార్డ్' గానే పరిగణించబడుతోంది. 'బాహుబలి 2' సినిమాకు టికెట్ ధరలు అధికపక్షం 30 శాతం మేర పెంచుకునేందుకు (రూ.70 - రూ.100, 90-150, 200-300) రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు అనుమతించాయి. రోజూ వేసే నాలుగాటలు కాకుండా అదనంగా ఒక ఆట వేసుకునేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, రెండాటలు వేసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అనుమతించాయి. 'బాహుబలి' మొదటి భాగం విడుదలైన రోజు మెయిన్ స్ట్రీమ్ మీడియాలో, సోషల్ మీడియాలో వచ్చిన రివ్యూలతో సంబంధం లేకుండా సినిమా థియేటర్లు తిరునాళ్లను తలపించాయి. 'బాహుబలి 2'కి పెంచిన టికెట్ల ధరలు కూడా ఇంటిల్లిపాది సినిమాకు వెళ్లగలిగే స్థాయిలో ఉన్నాయి కనుక ఆ సినిమా మొదటి వారం రోజులకు ముందస్తుగానే టికెట్లు ఆన్‌లైన్‌లో బుక్ అయిపోయాయి. ఆ తర్వాన్ని మరిచిన తెలుగు సినిమా పరిశ్రమ - టికెట్ల ధరల పెంపు ప్రేక్షకులకు ఆమోదయోగ్యమనే తప్పుడు అభిప్రాయానికొచ్చింది - 'భారీ బడ్జెట్' బ్యానర్ మీద 'సినిమా టికెట్ల ప్రైస్ హైక్' అనే చిత్రానికి పెద్ద నిర్మాతలు 'క్లాప్' కొట్టారు. ఎంత క్రేజీ ప్రాజెక్ట్ అయినా కూడా ప్రేక్షకులకు అందుబాటులో లేని ధరల్లో టికెట్లు విక్రయించాలని చూడటం కూర్చున్న కొమ్మనే నరుక్కోవడం లాంటిదని 'పుష్ప 2' సినిమాకు వస్తున్న వసూళ్లను చూసైనా అర్థం చేసుకోవాల్సిన అవసరముంది. అల్లు అర్జున్ నటించిన 'పుష్ప' ఉత్తర భారతదేశంలో పెద్ద విజయం సాధించడంతో 'పుష్ప' రెండో భాగం సంచలన విజయం సాధించబోతోందనే అంచనాలు దేశవ్యాప్తంగా ఏర్పడ్డాయి. దాంతో గతంలో ఎన్నడూ లేని విధంగా టికెట్ల ధరలు నాలుగైదింతలు పెంచారు. బాహుబలి 1, 2 భాగాల కన్నా ఈ సినిమా విడుదలైన థియేటర్ల సంఖ్య, వేసిన షోల సంఖ్య, టికెట్ల ధరలు ప్రతీది హీనపక్షం మూడింతలు ఎక్కువ ఉన్నప్పుడు తెలుగు రాష్ట్రాల్లో వసూళ్లు మాత్రం ఆ స్థాయిలో ఎందుకు లేవు? సినిమా ప్రేక్షకుల్లో విశ్వసనీయత ఉన్న వెబ్‌సైట్ల నుంచి మెయిన్ స్ట్రీమ్ మీడియా, సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానెళ్లు - అధిక శాతం మాధ్యమాల్లో సినిమా బాగుందనే మాటే వినిపిస్తున్నా పెంచిన ధరల నిష్పత్తిలో వసూళ్లు ఎందుకు లేవు? డిసెంబర్ 9 నుంచి 16వ తేదీ వరకు సింగిల్ స్క్రీన్స్‌లో టికెట్ ధర మీద అదనంగా 105 రూపాయల మేర విక్రయించుకునేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకుని కూడా సాధారణ ధరలకు (సింగిల్ స్క్రీన్స్‌లో ఈ రోజు టికెట్ ధర 200 రూపాయలు ఉంది) ఎందుకు దిగారు? ఈ లెక్కలన్నీ సరిగ్గా వేసుకోగలిగేవాళ్లకు స్పష్టంగా అర్థమయ్యేదేంటంటే.. సినిమా టికెట్లు సాధారణ ధరలకే విక్రయిస్తే - సినిమా మొదటి మూడు రోజులూ తాము చూడటానికి, ఇంట్లో అందరికీ చూపించడానికి హీరోల అభిమానులు, సినిమా ప్రేక్షకులు ఆసక్తి చూపిస్తారు... పదో, పరకో పెంచితే అయ్యే ఖర్చులో ఇంకొంత అనుకుని ఇంటిల్లిపాదీ సినిమా చూడటానికి వెనకాడకపోవచ్చు... కానీ ఇష్టానుసారంగా టికెట్ల ధరలు పెంచితే మాత్రం నాలుగు రోజులు పోయాక ఇంట్లో కూర్చుని హాయిగా టీవీలో చూద్దామనుకుంటారు తప్ప సినిమా థియేటర్‌కి వెళ్లాలనే ఆలోచనను కూడా ఎవరూ దరిచేయనీయరు. దేశ సంపద ఎర్రచందనం ఒకవైపు దోపిడీ చేస్తూనే వంద రూపాయల సినిమా టికెట్‌ను మూడు వేలు పెట్టి బీదాబిక్కి, మధ్యతరగతి జేబులు కొడుతున్న పుష్పరాజ్ ఆయన సృష్టికర్త సుకుమార్‌కి జేజేలు. నీ వ్యాపార నీతి ప్రపంచ వాణిజ్య శాస్త్రాలలో పార్యాంశం చేసేలా ఉన్నావ్. సినిమా నీ సృజన కావొచ్చు.. నీ భావోద్వేగ పెట్టుబడి కావొచ్చు.. నీ సినిమాకు టికెట్ రేటు నిర్ణయించుకునే హక్కు నీకు ఉన్నట్టే ఒక మేదరి వాడు ఒక బుట్ట చేస్తాడు. ఒక సాలె బట్టను నేస్తాడు. రైతు బురదను బువ్వగా మారుస్తున్నాడు. ఒక కమ్మరి, కుమ్మరి, నేత, ఇంకో సృజనకారుడు తోలు నూని చెప్పులు చేస్తాడు. తన సృజనకు నచ్చిన రేటు నిర్ణయించుకునే హక్కు, అధికారం, స్వేచ్ఛ కింది కులాలకు కూడా ఉంది కదా సుకుమారు గారూ.. ఒక దొంగ చెట్లను కొట్టి దొంగలకు నాయకుడు అవుతాడు. వాడు అడివి దాటి నగరానికి వస్తాడు నగరం వదిలి పట్టణం దాన్ని వదిలి ఐక్యరాజ్య సమితి మీద జెండా వేస్తాడు. అక్కడ ఆయుధాలు అమ్ముకునే వాడికీ, ఇక్కడ టిక్కెట్లు అమ్ముకునే నీకూ పెద్ద తేడా లేదు.



## వేపపుల్లకు.. గిరాకీ పెరుగుతోంది!

ఈ రోజుల్లో దంతధావనం కోసం, నోటిబ్రష్‌ల కోసం సూపర్ మార్కెట్టుకు వెళితే వివిధరకాల బ్రష్‌లు దర్శనమిస్తాయి. ఒక్కోటీ చూస్తుంటే వాటి వాణిజ్య ప్రకటనలు గుర్తుకొస్తాయి. ఒకో బ్రష్‌కు ఒకో ప్రత్యేకత, ఒక బ్రష్ చాలా మృదువుగా ఉంటుంది అంటారు. ఇంకో బ్రష్‌కేమో బ్రష్ మెడ ఎలా కావాలంటే అలా వంగుతుంది అంటారు ప్రకటనలలో.. ఈ మధ్యన తిరిగి ప్రవేశపెట్టిన ఎలక్ట్రిక్ టూత్ బ్రష్ వైర్‌లెస్ ఛార్జింగ్, బ్లూటూత్‌కు అనుసంధానం చేసుకునే వెసులుబాటుతో పునఃప్రవేశపెట్టారు. యువత ఎప్పుడూ విపణిలోకి ప్రవేశించిన కొత్త టెక్నాలజీ కోసం వెంపర్లాడుతారు, సహజంగానే ఈ కొత్త బ్రష్ బోల్డు డబ్బులు తగలేసి కొంటారు. ఒకప్పుడు దేశస్థులందరికి దంతధావనం చేసుకునే బ్రష్ ప్రకృతిలో సహజసిద్ధంగా ఫ్రీగా దొరికేది వాడేవారు. లేత, ముదురు, కానీ వేపకొమ్మ నుంచి పుల్ల విరిచి, యుగాలుగా వాడారు రోజూ ఉదయాన్నే మన వాళ్ళు. మన సంస్కృతిలో వేపచెట్టుకు చాలా ప్రాముఖ్యత ఉంది. వేప చెట్టును పవిత్రంగా భావించేవారు. కారణం దేవతలు వేపచెట్టుకు అమృతంను చిలకరించి సృష్టించారు.. అని పురాణాల్లో ఉంది, మానవులకు బహుమతిగా ప్రసాదించారు అన్నది అనాదిగా మనవాళ్ళు వేపచెట్టును పవిత్రంగా చూడడానికి కారణమే కాకుండా, వేప చెట్టులోని ప్రతి భాగం మనకు ఉపయోగ పడుతుంది. అందులోని ఒక చిన్న భాగం ఈ వేప పుల్ల.

**- సుబ్రహ్మణ్యం వల్లూరి**

తాత్విక ప్రాముఖ్యత ఒక్కటే కాకుండా, వేపపుల్లలు వాడడానికి శాస్త్రీయ కోణంతో మన పూర్వీకులు వాడడం ప్రారంభించారు. వేపపుల్ల చివర నోట్లో పెట్టుకొని చివరి భాగాన్ని నవులుతూ దంతధావనం ప్రారంభిస్తారు. ఈ నవలడం వల్ల నోట్లోకి లాలాజలం ఉత్పత్తి చేసే గ్రంధులు ఉత్తేజితులై, లాలాజలం ఎంజైములు విడుదల అవుతాయి. ఈ ఎంజైములు వేపపుల్లల నుంచి వచ్చే రసానికి తోడై నోటిలోని దంతాలకు, పళ్లకు, చిగుళ్లకు రక్షణ కల్పిస్తాయి. వేపపుల్ల నవలడం వల్ల పళ్ళు సమానమైన ఆకృతి ఏర్పరుచుకుంటాయి కూడా చిన్న వయసులో తరుచూ వాడకంతో. దీనితో దవడలు గట్టిపడడం, పళ్ళ ఆకృతి అందంగా సమానంగా ఏర్పడడం, దంతాలు పటిష్టంగా ఏర్పడడం జరుగుతుంది. కొద్దిసేపు పుల్లను నమిలిన తరువాత పుల్ల చివర్లో మెత్తటి బ్రష్‌లా ఏర్పడుతుంది. అప్పుడు పళ్ళను మృదువుగా తోమడానికి వీలౌతుంది. పళ్లపొడి, పేస్ట్ వాడాలిసిన అవసరం లేదు. వేపపుల్ల నుంచి విడుదలయ్యే రసాలలో ఎన్నో ఔషధాలు ఉన్నాయి. అవి నోటిలోని క్రిములను అంతం చెయ్యడం, పళ్ళమీద ఏర్పడే పలకలు నిర్మూలించడంలో వేపపుల్ల చాలా ఉపయోగపడుతుంది.

వేపపుల్లలో వుండే ఖనిజాలు పళ్ళమీద వుండే ఎనమేల్‌ను పటిష్టపరుస్తుంది. ఇందులో వుండే రోగక్రిమి నాశక (జెర్మిసైడల్) గుణాలవల్ల నోటి దుర్వాసనను దూరం చేస్తుంది. నోటినుంచి చెడు రావట్లేదు అంటే సువాసన వస్తుందని కాదు. ఊపిరి ఫ్రెష్‌గా ఉంటుంది.

ఎన్నో వేల సంవత్సరాలు మన భారతీయులు వేపపుల్ల వాడి తమకు దంత సమస్యలు తలెత్తకుండా చుసుకున్నారు వేపపుల్ల దొరకకపోవడం అన్న సమస్యే ఉండేది కాదు. చెట్లు ఎక్కడ పడితే అక్కడ ఉండేవి. ఒకేసారి వారానికి సరిపడే పుల్లలు ఇంట్లో ఉంచుకునేవారు. పుల్ల ఎండిపోతే అందులోని రసాలు ఎండిపోయి ఉపయోగించే లక్ష్యం దెబ్బతింటుంది, నమలడానికి కష్టం. నగరాల్లో చెట్టు అందుబాటులో లేకపోతే పదో పన్నెండో వేపపుల్లలు కట్టగా అమ్మేవారు.





ఒక నలభై ఏళ్ళ క్రితం వరకు ఏ ఊరెళ్లినా బస్, రైలు దిగిన వెంటనే వేపపుల్లలు అమ్మేవారు దర్శనమిచ్చేవారు. అంతర్జాతీయ సంస్థల వాణిజ్య ప్రకటనలకు ఆకర్షితులై, వేపపుల్ల వల్ల ఒనగూరే ప్రయోజనాలను విస్మరించి, పళ్లపొడిని, వేపపుల్లని త్యజించారు. 1990 ప్రాంతాల్లో పల్లెటూర్లలో కూడా వీటిని వదిలేసి బ్రష్ ఉపయోగించడం ప్రారంభించారు.

ఆశ్చర్యకరంగా, భూమి గుండ్రంగా ఉంటుంది అన్నట్టు ఇప్పుడు విదేశాల్లో వేపపుల్ల వాడకం పెరిగింది. ఆర్గానిక్ టూత్ బ్రష్ పేరుతో, అమెరికాలో విస్తృతంగా ప్రకటనలు గుప్పించి మళ్ళీ మన వేపపుల్లని ప్రాముఖ్యతలోకి తెస్తున్నారు. వేపపుల్ల ధర ఎక్కువైనా ఎగబడి కొంటున్నారు. కొన్నిరోజులుపోతే అంతర్జాతీయ సంస్థల వాణిజ్య ప్రకటనలు మన ఇళ్లల్లో ప్రత్యక్షమౌతాయి. మనింటి పక్కన ఉన్న వేపచెట్టు నుంచి తుంచుకుని వాడే అవకాశం ఉన్నా, ఆన్లైన్లో ఆర్డర్ పెడతారు సేల్‌లో తక్కువకు ఇస్తున్నారని మనవాళ్ళు. చెట్టు మీద ఉన్నదానికన్నా ఆన్లైన్‌లో ఆర్డర్ ఇచ్చి కొన్న పుల్లే బాగుంది అనుకునే గొప్పవాళ్ళు.

మేము వేపపుల్ల వాడుతున్నాం మీరు వాడట్లేదా అని మనల్ని దెప్పిపొడిచే రోజు దగ్గరలోనే ఉంది. శుభవార్తే కదా!!.

## నా ఫిజిక్ ఫిట్‌కి రహస్యం ఇదే..!

తెలుగు ప్రేక్షకులకు ఇచ్చుట వాహనములు నిలుపరాదు సినిమాతో పరిచయం అయిన ముద్దుగుమ్మ మీనాక్షి చౌదరి మెల్లమెల్లగా టాలీవుడ్‌లోనే కాకుండా పాన్ ఇండియా స్థాయిలో స్టార్ హీరోయిన్‌గా మంచి గుర్తింపు దక్కించుకుని దూసుకుపోతుంది. ముఖ్యంగా టాలీవుడ్‌లో ఇటీవల బ్యాక్ టు బ్యాక్ లక్కీ భాస్కర్, మట్కా, మెకానిక్ రాకీ సినిమాల్లో నటించి ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ తన అందం, ముఖ్యంగా ఫిజికల్ ఫిట్‌నెస్‌కి సంబంధించి ఆసక్తికరవ్యాఖ్యలు చేసింది. ఒక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ ఎక్కువ శాతమంది నా ఫిట్‌నెస్ గురించి మాట్లాడుతూ ఉంటారు. నా ఫిట్‌నెస్‌కి నూరుశాతం నా తండ్రి కారణం. ఆయన చిన్నప్పటి నుంచి నన్ను ఆటల్లో ప్రోత్సహించారు. నా వెంట ఉండి స్పోర్ట్స్‌లో ట్రైనింగ్ ఇప్పించారు. అందుకే నేను స్విమ్మింగ్, బ్యాడ్మింటన్‌లో స్టేట్ లెవల్ ప్లేయర్‌గా చాలా మ్యాచ్‌ల్లో ఆడాను అంది. ఒక స్పోర్ట్స్‌పర్సన్‌ని కనుక సహజంగానే నేను ఫిట్‌గా ఉండేందుకు వర్కౌట్లు ఎక్కువ చేసేదాన్ని, ఇప్పుడు కూడా అదే అలవాటుతో రెగ్యులర్‌గా తాను ఫిట్‌నెస్ కోసం తాను ఎక్కువగా వర్కౌట్‌లు చేస్తూ ఉంటాను అంది. అందుకే తాను ఇంత ఫిట్‌గా ఉన్నాను అంటూ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ అమ్మడు సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతోంది. వెంకటేష్ హీరోగా రూపొందుతున్న ఆ సినిమాలో మీనాక్షి చౌదరి కీలకపాత్రలో కనిపించబోతున్నారు. సంక్రాంతి నుంచి ఈ అమ్మడి సందడి మొదలు పెట్టబోతుంది. వచ్చే ఏడాదిలో ఈ ఏడాది కంటే ఎక్కువ సినిమాలను చేసే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.

**- తుపాకి.కామ్ సౌజన్యంతో...**







**నిజమే- ఏమి చేసినా పోయిన ప్రాణం తిరిగిరాదు.**
**నిజమే- ఏమిచ్చినా ఆ శోకం తీరనిదే.**
**నిజమే- తెలవారని ప్రీమియర్ సంధ్యల్లో తగ్గని వైల్డ్ ఫైర్ రగిలించిన కార్చిచ్చు బూడిదచేసిన జీవితాలు చెప్పే ఐకానిక్ పాఠాలు ఎవరికి కావాలి? "వెయ్యి కోట్లు పెట్టాం కాబట్టి మొదటిరోజే లక్ష కోట్లు పిండుకోవాలి" అన్న ఆధునిక వినోద దోపిడీని ఒక విలువగా, ఆదర్శంగా, అవసరంగా, బాధ్యతగా మనమెన్నుకున్న ప్రభుత్వాలు అధికారికంగా అంగీకరించాక మొదటి రోజు మొదటి ఆట, బెనిఫిట్ (ఎవరికో?)షో, ప్రీమియర్ షో చూడకపోతే ప్రాణం పోతుందని మనం విలవిలలాడుతున్నప్పుడు ప్రాణాలు పోకుండా ఎలా ఉంటాయి?**

## తెలవారని సంధ్యలెన్నో!!



అభిమానులున్నదే ప్రీ రిలీజుల్లో పోలీసు చేతిలో లాఠీ దెబ్బలు తినడానికి. రిలీజయ్యాక బ్లేడ్లతో కోసుకుని రక్తతిలకాలు దిద్దడానికి. కటౌట్లకు పాలాభిషేకాలు చేయడానికి. అభిమాన సంఘాలుగా ఏర్పడి సంఘంలో సంఘజీవులమన్న మౌలికమైన స్పృహ మరచి, మంచీమర్యాద మరచి చొక్కాలు చింపుకోవడానికి. తన్నుకోవడానికి. కులాలుగా విడిపోయి పరస్పరం పొడుచుకోవడానికి. ఇళ్ళల్లో అమ్మానాన్న, దేవుడి ఫోటోలు, నాలుగు అక్షరాలు నేర్పిన గురువుల ఫోటోలు పెట్టుకున్నా పెట్టుకోకపోయినా హీరో- హీరోయిన్ ల ఫోటోలు పెట్టుకోవడానికే. తెరమీద హీరోలు తెరవెనుక కనీసం జీరో విలువకుడా లేనివారని తెలిసినా హారతులు పట్టాల్సిందే.

"ఎంత రేటు పెంచినా సినిమా చూసి తీరాల్సిందేనని ఎవరూ తుపాకీ పెట్టి బెదిరించడం లేదు కదా? ప్రేక్షకులే వినోదంకోసం ఇష్టంగా వస్తున్నారు. కొంటున్నారు" అన్నది ఒక సమర్థన. పది రూపాయల టికెట్టు వెయ్యి రూపాయలు చేసి ఈ సినిమా మెదటి రోజు మొదటి ఆట చూడకపోతే రౌరవాది నరకాల్లో పడి చస్తారని కృత్రిమ హైప్ క్రియేట్ చేస్తున్నదెవరు? తొక్కిసలాట సంధ్యలో ప్రాణం పోయిన రేవతికి ఒక కంట కన్నీరు కారుస్తూ, ఇంకో కంట్లో తొలిరోజు కలెక్షన్ల రికార్డ్ బద్దల లెక్కల ఆనందబాష్పాల చుక్కలు జలజలా కారుస్తున్నదెవరు?

థియేటర్లో హీరో టాప్ లెస్ వెహికిల్ ప్రదర్శన గంగ వెర్రి జాతరలో ఒక ప్రాణం పోయి మరో చిరు ప్రాణం కొడిగట్టే దీపంలా మిణుకుమిణుకుమంటున్నప్పుడయినా ఇకపై ప్రీమియర్ షోలకు అనుమతులుండవని ప్రభుత్వం ప్రకటించడం ఆహ్వానించదగ్గది. ఈపని ఎప్పుడో చేయాల్సింది.

**ప్రీ రిలీజు వేడుకలకు ప్రభుత్వం పోలీసు భద్రత ఎందుకివ్వాలి? అయిదు వేలమందిని పిలిస్తే లక్షమంది వచ్చి ఊరు ఊరంతా ట్రాఫిక్ జామ్ ఎందుకు కావాలి?**



ఇంట్లో కూర్చుని ఏకాంతంగా లైవ్‌లో మాట్లాడితే కోట్లమంది ప్రత్యక్ష ప్రసారంలో చూడడానికి వీలున్న ఈరోజుల్లో ప్రభుత్వానికి ఈ సినిమా అశాంతి అభద్రత తలనొప్పి ఎందుకు?

ప్రజాస్వామ్య పార్లమెంటులో స్టెన్ గన్ తో ప్రతినిధులను కాల్చి చంపే కథలో హీరోకు మూడొందల కోట్ల రెమ్యున రేషన్, కాపీ కథల కలర్ జెరాక్స్ దర్శ కుడికి వందకోట్ల రెమ్యునరేషన్ ఇవ్వా లని నిర్మాతకు ఏ అభిమాని చెప్పాడు? ఎప్పుడు చెప్పాడు? చిన్నపిల్లలు సెల్ ఫోన్లో సృష్టించగలిగే గ్రాఫిక్స్‌కు వంద కోట్లు పారబోయమని ఏ అభిమాన సంఘం ప్రాధేయపడింది? పది రూపాయల వడ్డీకి తెచ్చి పసలేని కథతో నీటిమీద రాతలు రాసుకోమని నిర్మాతను ఎవరు అడుక్కుంటున్నారు? పెళ్లీడు మునిమనవ రాలు ఉన్నా ఇంటర్ చదివే అమ్మాయితో తుంటరి డ్యాన్స్ లే చేయాలని ముత్తాత హీరోను ఎవరు అడుక్కుంటున్నారు? పేరుకు సినిమా పరిశ్రమ. శ్రమ ప్రేక్షకులతో పాటు అందరిదీ. ఫలి తం పట్టుమని పది మందిది.

పనిలో పనిగా సిమాటోగ్రఫీ మంత్రి ఇంకొంచెం లోతుగా దృష్టిపెడితే తెరముందు, తెరవెనుక, తెర కింద, తెరపక్కన, తెరదగ్గర, తెర చుట్టుపక్కల, తెరపేరిట జరిగే పట్టపగటి వినోద దోపిడీల తెర తొలగిపోతుంది. మంత్రి ఆ తెర తీయగలరా?


**"రాలిపోయే రేవతీ! నీకు రాగాలెందుకే?**
**వాలిపోయే సంధ్యా! నీకు వర్ణాలెందుకే?"**

**-పమిడికాల్వ మధుసూదన్**

## భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

(సత్యంన్యూస్, నరసన్నపేట)


భూసమస్యల పరిష్కరించడానికే ప్రభుత్వం ప్రతిగ్రామంలో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని, రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మడపాం గ్రామంలో నిర్వహిస్తున్న మీ భూమి- మీ హక్కు రెవిన్యూ సదస్సులను కార్యక్రమానికి శాసనసభ్యులు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల భూ సమస్యలన్ని పరిష్కరించే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. క్రమశిక్షణతో పనిచేస్తే ఎవరికి సమస్యలు ఉండవన్నారు. వీఆర్వోలు నిక్కచ్చిగా పనిచేస్తే భూముల వివరాలు ఎప్పటికప్పుడు రెవెన్యూ రికార్డులలో నమోదు చేయాలన్నారు. భూ సమస్యలతో ప్రజలు బాధపడుతున్నట్టు గుర్తించిన ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సదస్సులో ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. మీ సమస్య పరిష్కరించడం జరిగిందా లేదా మీ సెల్ ఫోన్‌కి కచ్చితంగా మెసేజ్ అందజేస్తామన్నారు. గ్రామ రెవెన్యూ అధికారులంతా రెవెన్యూ సదస్సులకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని చెప్పారు. ప్రజలు నేరుగా వచ్చి తమ వినతిపత్రాల ద్వారా రికార్డులలో పరిస్థితిని తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో తహాశీల్దార్, ఎంపీడీవో, మండల స్పెషల్ ఆఫీసర్, మండల పార్టీ అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, మండలపార్టీ ప్రధాన కార్యదర్శి అడపా చంద్రశేఖర్, రావాడ కృష్ణ, సర్పంచ్‌లు రాపర్తి ఎరుకువాడు, చింతు రాజన్న, గొద్దు సుందరరావు, చింతు మల్లేశ్వరరావు, దిలీప్, సింహాచలంలు పాల్గొన్నారు.




## 'మనబడి' మాస పత్రికను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి

(సత్యంన్యూస్, అమరావతి)

పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో రూపొందిన 'మనబడి'మాసపత్రికను బాపట్లలో శనివారం నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ఆవిష్కరించారని సమగ్రశిక్షా పథక రాష్ట్ర సంచాలకులు బి.శ్రీనివాసరావు ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్, ఎంపీ టి.కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే వేగేశ్న నరేంద్రవర్మ, పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, డైరెక్టర్ విజయరామరాజు, బాపట్ల కలెక్టర్ వెంకటమురళి, విద్యార్థుల తల్లిదండ్రులు, టీచర్లు ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కరదీపికలా ఉపయోగపడే మనబడి మాసపత్రికను రాష్ట్రంలో ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు అన్నింటికి నెలనెలా పంపుతామని తెలిపారు. సామాజిక మాధ్యమాలు, వాట్సప్, యాప్, వెబ్సైట్ ద్వారా 'మనబడి' ఈ కాపీ అందరికీ చేరుస్తామన్నారు. విద్యార్థులు వేసిన బొమ్మలు, రాసిన కథలు, కవితలు, పాటలు, వినూత్న ప్రయోగాలు, ఆటలు, సాధించిన విజయాలు-బహుమతులు, విద్యార్థుల విజయ గాథలకు పత్రికలో ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు, విద్యావేత్తల వ్యాసాలు, ఆలోచనలతో మాస పత్రికను అందంగా ,ఆకర్షణీయంగా తీసుకురావడం తమ లక్ష్యమని వివరించారు.




## భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

భూసమస్యల పరిష్కరానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రాష్ట్రంలో భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెవెన్యూ సదస్సులను ఎమ్మెల్యే గొండు శంకర్ ఆధ్వర్యంలో రూరల్ మండలం కిష్టప్పపేటలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న భూసమస్యలను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఆక్రమణలు, ఫ్రీహోల్డ్, మ్యుటేషన్, 22 ఏ, డీకేట్, రీసర్వే, ఇతర రెవెన్యూ సంబంధిత అంశాలపై వినతులు స్వీకరించి 15 రోజుల్లో పరిష్కరించనున్నట్లు తెలిపారు. గత వైకాపా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రద్దు చేసినట్లు వివరించారు. ప్రభుత్వమే ప్రజల వద్దకు వెళ్ళి సమస్యలను పరిష్కరించాలన్నదే మీ భూమి మీ హక్కు రెవెన్యూ సదస్సుల ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో అన్ని మండలాల్లో సదస్సులు కొనసాగుతున్నాయన్నారు. అధికారులు ప్రజల నుంచి వినతులను స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో భూ వివాదాల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టి సారించిందని వివరించారు. ప్రజా సంస్కరణలను దృష్టిలో పెట్టుకొని సీఎం చంద్రబాబునాయుడు సంక్షేమ పథకాలను రూపొందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## సమాజంలో సమానంగా గౌరవించబడాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక నైరా వ్యవసాయ కళాశాలలో జిల్లా న్యాయశాఖ సేవాధికార సంస్థ, వారు న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. గౌరవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయశాఖ అధికారి సంస్థ వారి ఆదేశానుసారం సీనియర్ సివిల్ జడ్జి కార్యదర్శి జిల్లా న్యాయశాఖ అధికారి సంస్థ ఆర్.సన్యాసినాయుడు స్థానిక నైరా, వ్యవసాయం పరిశోధన కళాశాలలో మానవ హక్కులను గూర్చి న్యాయ విజ్ఞానసదస్సు ఏర్పాటు చేశారు. స్వేచ్ఛగా స్వతంత్రంగా బ్రతకడం ప్రతి మనిషి జన్మహక్కు అని తెలిపారు. కార్యక్రమంలో జి.ఇందిరాప్రసాద్, అడ్వకేట్, డి.చిన్నంనాయుడు, వి.శ్రీనివాస్, డి.అనిల్ కుమార్, ప్రొఫెసర్లు, విద్యార్ధులు పాల్గొన్నారు.




## లక్ష్మణరావుకు డిగ్రీ ప్రధానం

(సత్యంన్యూస్, ఆమదాలవలస)



మండలంలోని అక్కులపేట గ్రామానికి చెందిన నాంబారు లక్ష్మణరావుకి డిగ్రీ పీహెచ్‌డీ ప్రధానం చేశారు. ప్రొఫెసర్ చందన్ ఆధ్యర్యంలో స్టాటిస్టిక్స్ విభాగంలో "వేరియస్ ఫజీ టెక్నిక్స్ ఫర్ మోడలింగ్ కమ్యూనికేషన్ నెట్వర్క్ విత్ బల్క్ అరైవల్ క్యూయింగ్ సిస్టమ్" అనే అంశం పైచేసిన పరిశోధనకు గాను డిసెంబర్-2024లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రపంచంలో అత్యుత్తమమైన డిగ్రీ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావును పలువురు అభినందించారు.

## ఆశ్రా సేవలు అభినందనీయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వినియోగదారుల హక్కులు, పరిరక్షణ కోసం ఆశ్రా సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి జి సూర్య ప్రకాషరావు అన్నారు. కలెక్టరేట్‌లో ఆయన ఆశ్రా (అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్‌నెస్) పోస్టర్‌ను అధ్యక్షులు గంజి ఆర్.ఎజ్రా ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎస్ఓ మాట్లాడుతూ గ్రామీణప్రాంతాల్లోని ప్రజలకు వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించడంలో ఆశ్రా చేస్తున్న కృషిని అభినందించారు. ఈనెల 15న ఆసరా జాతీయ వారోత్సవాలను బెంగుళూరులో నిర్వహించినట్లు తెలిపారు. వినియోగదారులకు తమ హక్కులపై అవగాహన కల్పించడంతోపాటు, వారి నుంచి వచ్చే ఫిర్యాదులను సంబంధిత ఫోరమ్‌లో దాఖలు చేయడం కూడా ఆశ్రా పని అని ఎజ్రా పేర్కొన్నారు. జిల్లాలలో సహాయం కోరే వినియోగదారులను గుర్తించి వారికి ఆశ్రా కల్పిస్తున్నామని వివరించారు. వస్తువులు, సేవల నాణ్యత, సామర్థ్యం, స్వచ్ఛత, ధర, ప్రమాణం.. వీటికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకొనే హక్కును కలిగి ఉండటమే వినియోగదారుల యొక్క హక్కు అని అర్థమని చెప్పారు. వ్యాపారంలోని అనుచిత పద్ధతుల బారిన పడకుండా వినియోగదారును కాపాడవలసి వుంటుందన్నారు. ఈ హక్కులను గురించి వినియోగదారులు తెలుసుకోవలసిన అవసరం ఎంతయినా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గేదెల ఇందిరా ప్రసాద్, ఆనంద గజపతి, జాయింట్ సెక్రెటరీ అడ్వకేట్ అనిల్‌రాజ్, కార్యవర్గ సభ్యులు అడ్వకేట్ కేపీ.సారధి, బాలకృష్ణ పట్నాయక్, ఆకులకృష్ణలు పాల్గొన్నారు.



## ఇజ్జాడపాలెంలో "మెగా వైద్యశిబిరం"

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈరోజు ఇజ్జాడపాలెం గ్రామంలో, సామాజిక సేవకులు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గురుగుబెల్లి దామోదరరావు ఆధ్వర్యంలో హ్యూమన్ కేర్ ఫౌండేషన్ హైదరాబాద్ వారి సౌజన్యంతో మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు ఈ శిబిరాన్ని దామోదరరావు ప్రారంభించారు. అనంతరం దామోదరరావు మాట్లాడుతూ భారతదేశంలో మొట్టమొదటిసారిగా ఎటువంటి బ్లడ్‌శాంపిల్స్ తీయకుండా కంప్యూటర్ నాడీ తరంగణి పద్ధతిలో నాడీవ్యవస్థ ద్వారా శరీరంలోని లోపములను భవిష్యత్తులో మీ శరీరమునకు సంబంధించిన పరీక్షలు చేయబోతున్నారు. కిడ్నీ, గుండె, లివర్, బిపి, షుగర్ మొదలైన పరీక్షలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యాధికి తగ్గట్టు ఉచిత మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ యు.రవి, వై.యస్.చిన్నారావు, బాలి నీలంనాయుడు, కర్రోతు శ్రీనివాస్ పొడుగు శ్రీనివాస్, పొడుగు రమేష్, బత్తుల మోహనరావు గేదెల సూర్యారావులు పాల్గొన్నారు



## జాతి మరచిన జాతిరత్నం గరిమెళ్ళ

**- అరసం జిల్లా అధ్యక్షులు నల్లి ధర్మారావు- "గరిమెళ్ళ కవితా స్రవంతి" పుస్తకావిష్కరణ**



(సత్యంన్యూస్, నరసన్నపేట)

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజాకవి గరిమెళ్ళ సత్యనారాయణ నేటితరం మరచిన జాతి రత్నం అని అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు, ప్రముఖ పాత్రికేయులు నల్లి ధర్మారావు అన్నారు. గరిమెళ్ళ మెమోరియల్ ట్రస్ట్, అరసం, ప్రగతి సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో అరసం, విజయనగరం వారు ప్రచురించిన "గరిమెళ్ళ సాహితీ స్రవంతి" అను పుస్తకావిష్కరణ, "మాకొద్దీ తెల్లదొరతనం"నాటిక పరిచయసభ ప్రియాగ్రహారంలో ఐ.గణపతిరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ గరిమెళ్ళ రచనలు నేటికీ సమాజంలో చైతన్యం నింపే అస్త్రాలు అని అన్నారు. అరసం, విజయనగరం జిల్లా కార్యదర్శి రత్నాల బాలకృష్ణ మాట్లాడుతూ గరిమెళ్ళ పాట నాటి తెల్లోడి గుండెల్లో పేలిన తూటా అని అన్నారు. గిడుగు రామ్మూర్తి జానపదకళా పీఠం అధ్యక్షులు బద్రి కుర్మారావు మాట్లాడుతూ గరిమెళ్ళ పుట్టిన ప్రియాగ్రహారంలో పుట్టిన ప్రతిఒక్కరూ ధన్యజీవులన్నారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి మాట్లాడుతూ గరిమెళ్ళ జయంతి, వర్ధంతి వేడుకలు ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. గరిమెళ్ళ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ఎన్.ఈశ్వరరావు, గరిమెళ్ళ మెమోరియల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి బాడాన రాజు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సాధనకు నిస్వార్థంగా పోరాడిన గరిమెళ్ళ సత్యనారాయణ పేరు శ్రీకాకుళం జిల్లాకు పెట్టాలని డిమాండ్ చేశారు. ఐ.గణపతిరావు పాడిన మాకొద్దీ తెల్లదొరతనం పాట అందరినీ ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమంలో అరసం నాయకులు చింతాడ కృష్ణారావు, బద్రి కుర్మారావు, దుబ్బ కోటేశ్వర రావు, స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.నాగకుమారి, ప్రధానోపాధ్యాయులు ఎస్.విశ్వేశ్వరరావు, డాక్టర్ జి.జయపాల్ రావు, ఎం.వి.మల్లేశ్వరరావు, రాగుపాటి నారాయణమూర్తి, పి.మహేశ్వర రావు, సాహితీవేత్తలు, అభిమానులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రాష్ట్రంలో గంజాయి వంటి మత్తు పదార్థాలు ఎక్కువగా రవాణ జరుగుతుండడంతో కొత్తూరు ఒరిస్సా బోర్డర్ కావడం వలన సీఐ చంద్రశేఖర్ మత్తు పదార్థాల అక్రమ రవాణాపై ప్రత్యేకంగా దృష్టి సారించి వాటిని అరికట్టే దిశగా ప్రయత్నం చేస్తూ స్పెషల్ నార్కోటిక్ డాగ్ ద్వారా అనుమానిత వాహనాలు ఒరిస్సా నుండి వచ్చే వాహనాలు ప్రత్యేకించి అనుమానాస్పద వ్యక్తులను వాహనాలను కూడా తనిఖీ చేశారు.

**- సత్యంన్యూస్, కొత్తూరు**



గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకులు గుండ అప్పలసూర్యనారాయణను సోమవారం టీడీపీ పాలిట్‌బ్యూరో సభ్యులు, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు పరామర్శించారు. ఈమేరకు గుండ స్వగృ హానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **- సత్యంన్యూస్, శ్రీకాకుళం**




## చదువే ముఖ్యం!

క్రీడాకారులు ఏం చదువుకున్నారు? సచిన్ టెన్త్, కోహ్లీ ఇంటర్, ధోనీ బీఏ ఫెయిల్ అంటూ చాలా సార్లు మనం సోషల్ మీడియాలో పోస్టులు చూశాం. క్రికెటర్లు, సినిమా నటులు, కళాకారులు చాలా మంది పెద్దగా చదువుకోలేదని.. అయినా వారు పేరు ప్రఖ్యాతులు, డబ్బు సంపాదించడం లేదా అని ప్రశ్నించే వారినీ చూశాం. కానీ.. అది అన్ని వేళలా సాధ్యం కాదు. ఇలాంటి స్టేట్మెంట్ల ద్వారా పిల్లల మనసుల్లో చదువుకు విలువే లేదనేది నాటుతున్నామని గ్రహించలేక పోతున్నాం.

ఇంజనీరింగ్ చేసిన అనిల్‌కుంబ్లే ఒకసారి ఏమన్నాడంటే.. నేను బంతిని పెద్దగా స్పిన్ చేయనని.. నేనసలు స్పిన్నర్నే కాదన్నారు. ఆ విషయం పాక్షికంగా నిజమే ఒప్పుకుంటా. నేను బంతిని పరిస్థితికి తగ్గట్టు స్పిన్ చేస్తా.. అన్ని బంతులను కాదు. నేను ఇంజనీరింగ్ చదివా.. ఒక బంతిని ఎంత వేగంతో.. ఏ దిశలో వేస్తే.. బంతి వికెట్లను తాకుతుందో నేను కాలిక్యులేట్ చేయగలను. అందుకే నా బంతులు స్పిన్ అయినట్లు కనిపిం చవు. కానీ నా లెక్క ప్రకారం అవి దిశను తప్పకుండా మార్చుకొని బ్యాటర్లను ఇబ్బంది పెడతాయి అని అన్నాడు. ఇక ఫొటోలోని వెంకటేశ్ అయ్యర్ కూడా ఒక మాట చెప్పాడు. నేను ప్రస్తుతం ఫైనాన్స్‌లో పీహెచ్‌డీ చేస్తున్నాను. నెక్స్ట్ టైం నన్ను ఇంటర్వ్యూ చేసే సమయానికి నేను డాక్టర్ వెంకటేశ్ అయ్యుం టాను. నాకు చదువే ముఖ్యం. క్రికెట్ ఎంత కాలం ఆడగలను. మహా అయితే 35వ ఏట వరకు.. అంతే.. ఆ తర్వాత ఖాళీగా కూర్చో వడమే కదా. 60ఏళ్ల వరకు ఏదో ఒక పని చేయాలంటే చదువుకొని ఉండాలి. క్రికెట్ లేదా ఇతర క్రీడలకు సంబంధించిన ఉన్నత ఉద్యోగాలు చేయాలన్నా చదువు కావాలి కదా. చదవు లేకపోతే కామెంటేటరో, కోచ్‌నో కాగలను. అంతకు మించి ఏమీ చేయలేను. అందుకే చదువుకుంటున్నాను అన్నాడు. ఇది కదా క్రీడాకారులు, సెలబ్రిటీలు చెప్పాల్సింది. నెక్స్ట్ టైం పిల్లలకు వెంకటేశ్ అయ్యర్ లాంటి వాళ్ల గురించి చెప్దాం. చదువు లేకపోయినా సచిన్, కోహ్లీ సంపాదించలేదా అనే స్టోరీలు పక్కన పెడదాం..

- బాయిజాన్


ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోలేసేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001






బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు

* వ్యవస్థీకృతంగా నేరాలు
* పోలీసుల్ని, పత్రికల్ని కొనేశాడని ఎస్పీకి బాధితుల ఫిర్యాదు
* 11 మంది నుంచి రూ.50 లక్షలు వసూలు
* ఆర్మీలో ఉద్యోగాలిప్పిస్తానని మోసం
* బాధితుల మీదే భౌతిక దాడి

# రమణగాడు.. అందరి లోడూ ఎత్తేశాడు




డబ్బులు ఇచ్చినవారికి ఢిల్లీ ఆర్మీ హెడ్‌క్వార్టర్స్ పేరుతో ఇచ్చిన పత్రం

**ఇండియన్ ఆర్మీ కాలింగ్ వ్యవస్థాపకుడు బీవీ రమణకు అంత సీన్ లేదని, తెర వెనుక ఇంకెవరో ఉన్నారని 'సత్యం' వ్యక్తం చేసిన అనుమానం వాస్తవమేనని నెమ్మదిగా జిల్లా పోలీసులకు అర్థమవుతుంది. సోమవారం 'ఆర్మీకాలింగ్' వెనుక ఇంకెవరో ఉన్నారు పేరుతో 'సత్యం' వెబ్‌సైట్‌లో కథనాన్ని పోస్ట్ చేసిన కొద్దిసేపటికే ఆర్మీలో ఉద్యోగాలిప్పిస్తామని తమ వద్ద లక్షలాది రూపాయలు నొక్కేశాడంటూ నేరుగా ఎస్పీ గ్రీవెన్స్‌కే బాధితులు వచ్చి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. రమణ వీడియో హల్‌చల్ చేసిన తర్వాత మాత్రమే ఇటువంటివారు బయటకు రావడం వెనుక ఇంకేవైనా రమణను తొక్కేసే కారణాలున్నాయని కొంతమందికి అనుమానాలు ఉండొచ్చు. అయితే మాయల మరాఠీ బీవీ రమణ మీద ఉద్యోగాల పేరుతో మోసపోయినవారి పోరాటం ఈనాటిది కాదు. అయితే ఇప్పుడు పోలీసులు ఆయన్ను అరెస్ట్ చేశారని, మీడియా కథనాలు రాస్తుందని తెలుసుకున్న బాధితులు ఈ రెండు వ్యవస్థలను ఇప్పుడు కొద్దిగా నమ్మి బయటకు వచ్చారు. ఈ రెండింటి వల్లే గతంలో వీరు చేసిన పోరాటం బయటకు రాలేదు. దీంతో ఆర్మీకాలింగ్ రమణ తనకు తిరుగులేదన్న భావనతో చెలరేగిపోయాడు. ఎస్పీ కార్యాలయానికి ఫిర్యాదు ఇచ్చిన తర్వాత మీడియాతో మాట్లాడిన బాధితులు చెప్పిన అంశాలు వింటే ఇండియన్ ఆర్మీ కాలింగ్ పేరుతో రమణ గుండెలుతీసిన బంటుగా ఎలా మారాడో అర్థమవుతుంది.**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఇండియన్ ఆర్మీలో వివిధ హోదాల్లో ఉద్యోగాలు వేయిస్తానని చెప్పి ఉత్తరాంధ్ర ప్రాంతంలోని అనకాపల్లి, గజపతినగరం, విజయనగరం, విశాఖ, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు చెందిన నిరుద్యోగుల నుంచి రూ.లక్షలు వసూలుచేసినట్టు పదకొండు మంది బాధితులు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.మహేంద్రరెడ్డిని కలిసి సోమవారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే స్పందించిన ఎస్పీ ఒకటో పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్లకు బాధితులను పంపించి డీఎస్పీ వివేకానంద ఆధ్వర్యంలో ఆర్మీ కాలింగ్ రమణపై కేసు నమోదు చేయించారు. ఇటీవల సోషల్ మీడియాలో హల్‌చల్ చేసిన వీడియోల్లో బాధిత విద్యార్థి సాడి నవీన్‌తో పాటు మరో నలుగురు విద్యార్థులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదుచేసి రమణను కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. తాను ఎటువంటి తప్పు చేయలేదని బకాయిస్తున్న రమణకు కొందరు పోలీసు అధికారులు, మీడియా ప్రతినిధులు సహాయ సహకారాలు అందించినట్టు రమణ బాధిత నిరుద్యోగులు సోమవారం ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఎందుకు రమణకు వ్యతిరేకంగా ఫిర్యాదు చేయలేదని బాధితులను ఎస్పీ ప్రశ్నించినట్టు తెలిసింది. ఉద్యోగం కోసం డబ్బులు ఇచ్చి ఇన్నేళ్లు వేచిచూడడం కరెక్టు కాదని బాధితులను ఎస్పీ విచారించి తక్షణమే ఫిర్యాదు ఇవ్వాలని సూచించినట్టు తెలిసింది. ఎస్పీ ఆదేశాలతో శ్రీకాకుళం రూరల్, వన్ టౌన్‌లో 11 మంది బాధితులు రమణపై వ్యక్తిగతంగా ఫిర్యాదులు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించినట్టు తెలిసింది.

**పోలీసులకూ పాత్ర**

ఎస్పీని కలవడానికి వెళ్లిన బాధితులు చెప్పిన వివరాల మేరకు.. 2021లోనే ఆర్మీ కాలింగ్ రమణ వ్యవహారంపై నేవీ మాజీ ఉద్యోగి 80 మంది బాధితులను తీసుకొని శ్రీకాకుళం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లారు. ఆర్మీలో ఉద్యోగాలు వేయిస్తానని చెప్పి రూ.లక్షలు వసూలుచేసి రమణ మోసం చేశాడని ఫిర్యాదు చేశారు. అయితే అప్పటి ఎస్ఐ విజయ్‌కుమార్ బాధితులను బెదిరించి వెనక్కి పంపినట్టు వీరు ప్రస్తుత ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లారు. ఆర్మీ కాలింగ్ రమణ తరఫున అప్పటి ఎస్ఐ విజయ్‌కుమార్ వకాల్తా పుచ్చుకొని మాట్లాడినట్టు బాధితులు ఎస్పీకి వివరించారు. పోలీస్‌స్టేషన్‌కు రావడం పట్ల ఎస్ఐ విజయ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేసి అందరిపైనా కేసు కట్టి ఉద్యోగాలు రాకుండా జీవితం నాశనం చేస్తానని బెదిరించినట్టు వారు చెప్పుకొచ్చారు. రమణకు వ్యతిరేకంగా ఎటువంటి కేసు నమోదు చేయనని, దిక్కున్నచోట చెప్పుకోండంటూ బెదిరించినట్టు తెలిపారు. ఆర్మీ కాలింగ్ రమణతో మాట్లాడానని, ఆఫీస్‌కు వెళితే తీసుకున్న డబ్బులు ఇచ్చేస్తాడని, అయితే కేవలం ఐదుగురు మాత్రమే వెళ్లాలని ఎస్ఐ విజయకుమార్ అక్కడకు పంపించారని ఎస్పీకి బాధితులు తెలిపారు. ఎస్ఐ విజయ్‌కుమార్ సూచనలతో అక్కడికి వెళ్లిన తర్వాత ఐదుగురిపై రమణ దౌర్జన్యం చేయడంతో పాటు తనపై పోలీసులకు ఫిర్యాదు చేయిస్తావా అంటూ నేవీ మాజీ ఉద్యోగిపై దాడి చేసి ఆయన నుంచి ఫోన్ తీసుకొని దాన్ని ధ్వంసం చేశాడు. ఈ వ్యవహారంలో కొందరు జర్నలిస్టులు రంగప్రవేశం చేసి రమణకు అనుకూలంగా ఎవరిని కలిసినా ఇబ్బందులు తప్పవని హెచ్చరించినట్టు తెలిసింది. దీంతో నేవీ మాజీ ఉద్యోగి ఎవరిని ఆశ్రయించాలో తెలియక రమణ అడ్డగోలు వ్యవహారంపై అప్పటి ఎస్పీకీ ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, రమణకు పోలీసు శాఖలో కొందరు అధికారులు, సిబ్బంది సహకరించడం, జర్నలిస్టులు అండగా నిలవడంతో బాధితులు ఆయనపై ఫిర్యాదు చేయడానికి ముందుకు రాలేకపోయారని ఎస్పీ ముందు వాపోయారు. రమణ తన అరాచకాలను యథేచ్ఛగా సాగించడానికి అన్ని వ్యవస్థలను డబ్బులు ఇచ్చి మేనేజ్ చేస్తూ వచ్చాడని బాధితులు ఎస్పీకి వివరించి బోరుమని ఏడ్చినట్టు విశ్వసనీయ సమాచారం. వన్‌టౌన్ ఎస్ఐగా పనిచేసిన విజయ్‌కుమార్, అప్పటి రైటర్ ఉమ, కానిస్టేబుల్ గోవింద అండతోనే ఇదంతా జరిగిందని ఎస్పీ ముందు వాపోయారు.

**11 మంది నుంచి రూ.50 లక్షలు**

ఆర్మీ కాలింగ్ పేరుతో రమణ చేసిన అరాచకాలు ఒక్కొక్కటి వెలుగులోకి రావడంతో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ ప్రత్యేక దృష్టి సారించి చర్యలకు ఉపక్రమించడంతో తమకు న్యాయం జరుగుతుందన్న ఆశతో పోలీసుల ముందుకు వచ్చినట్టు 11 మంది బాధితులు, తల్లిదండ్రులు ఎస్పీకి విన్నవించారు. ఇండియన్ ఆర్మీలో ఉద్యోగం వేయిస్తానని ఒక్కొక్కరి నుంచి రూ.6లక్షల నుంచి రూ.10 లక్షలు వసూలు చేసినట్టు ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో బాధితులు పేర్కొన్నారు. సోమవారం ఎస్పీని కలిసి బాధితులే రూ.50 లక్షలు ఇచ్చినట్టు లెక్క తేలింది. డబ్బులు ఇచ్చిన వారందరికీ ఢిల్లీలో ఆర్మీ హెడ్‌క్వార్టర్‌లో డబ్బులు జమచేసినట్టు చూపించి ఎన్‌రోల్‌మెంట్ నెంబర్ ఇష్యూ అయినట్టు చూపిస్తూ అందరికీ బాండ్‌పేపర్లను కూడా ఇచ్చినట్టు బాధితులు ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లారు. ఒకటో పట్టణ పోలీసులు ఫిర్యాదు తీసుకోపోయినా కోర్టును ఆశ్రయించి రమణపై కేసు వేసినట్టు, ప్రస్తుతం న్యాయస్థానంలో కేసు నడుస్తుందని బాధితులు చెబుతున్నారు. తమతో పాటు అనేక మంది నిరుద్యోగుల నుంచి ఆర్మీలో ఉద్యోగాలు వేయిస్తానని రూ.లక్షల్లో వసూలుకు పాల్పడ్డారని బాధితులు చెబుతున్నారు. వ్యవస్థలన్నింటినీ రమణ మేనేజ్ చేస్తుండడంతో ఎవరూ ముందుకు రాలేకపోతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. రమణ వెనుక కొందరు పెద్దస్థాయి పోలీసులు, జర్నలిస్టులు ఉన్నారని, వీరి వల్లనే ఎక్కువ మంది నిరుద్యోగులు గత ఆరేళ్లుగా మోసపోతూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పెద్దలు దీన్ని సీరియస్‌గా తీసుకున్నారు కాబట్టి తమకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం కలిగిందని బాధితులు చెబుతున్నారు.

# హామీల అమలులో కూటమి విఫలం

## - 13న రైతుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి -

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైకాపా జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఆరోపించారు. రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన ఎంపీపీ కిల్లి సత్యనారాయణ అభినందన సమావేశం మంగళవారం స్థానిక గ్రాండ్ హోటల్‌లో ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో అన్నదాతకు అండగా పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 13న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రం అందించనున్నట్టు తెలిపారు. ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న హామీలను అమలు చేయకుండా, సమస్యలను పక్కదారి పట్టించే విధంగా కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని విమర్శించారు. మాజీ మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ రాజ్యసభ సీట్లను కూటమి ప్రభుత్వం అమ్ముకుందని ఆరోపించారు. క్రిమినల్స్‌కు రాజ్యసభ సీటు ఇవ్వడం సిగ్గుచేటని విమర్శించారు. కూటమి ఆరు నెలల పాలనలో అనేక అరాచకాలు వెలుగు చూశాయన్నారు. ప్రభుత్వానికి ఎదురెళ్లి నిలబడాల్సిన సమయం వచ్చిందని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. టెక్కలి ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైకాపాపై కక్షపూరితంగా వ్యవహరించి అక్రమంగా కార్యకర్తలను అరెస్టులు చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. కార్యకర్తలను భయపెట్టి మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు. జిల్లాలో వ్యవసాయ మంత్రి ఉన్నా రైతులకు ఒనగూరే ప్రయోజనం ఏమీ లేదని విమర్శించారు. కార్యక్రమంలో జెడ్పీ ఛైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, ఇన్‌ఛార్జిలు చింతాడ రవికుమార్, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి, పార్టీ నాయకులు పిన్నింటి సాయి, దుంపల లక్ష్మణరావు మాస్టారు, అంధవరపు సూరిబాబు, ఎంవీ స్వరూప్, అంబటి శ్రీను, జిల్లా నలుమూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజాసమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత

- **రాయివీధిలో చేతిపంపు ప్రారంభించిన ఎమ్మెల్యే శంకర్**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ప్రజాసమస్యల పరిష్కారానికే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రాయివీధిలో ప్రజల అవసరాల నిమిత్తం మంగళవారం చేతిపంపును ఎమ్మెల్యే శంకర్ తన సొంత నిధులతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పరిధిలోని డివిజన్లలో కాలువలు, రోడ్డు పాడవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, త్వరలోనే నగర సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలు రూపొందించి సుందర శ్రీకాకుళం నిర్మాణానికి శ్రీకారం చుడతామని చెప్పారు. గత ప్రభుత్వంలో డివిజన్లలో కనీస మౌలిక సదుపాయాలకు నోచుకోక ప్రజలు పడిన అవస్థలు వర్ణణాతీతమని, వర్షాకాలం వస్తే కాలువల్లో నీరు రోడ్లపైకి వచ్చే పరిస్థితి ఉండేదని, తాము అధికారంలోకి రాగానే 50 డివిజన్లలో కాలువల్లో పూడికలు తీయించామని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపడుతున్నామని చెప్పారు. పలు డివిజన్లలో ఇప్పటికే రోడ్లు, డ్రైన్లు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. అనంతరం రాయివీధిలో రాయి కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమ్మవారి సంబరాల్లో ఎమ్మెల్యే శంకర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ పాత్రపై దర్యాప్తు చేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అదాని గ్రూప్ కంపెనీల అవినీతి, తప్పిదాలు, క్రోనీకాప్ట్ లిజాన్ని ప్రోత్సాహించడంలో కేంద్ర ప్రభుత్వ పాత్రపై దర్యాప్తు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు స్థానిక పాత బస్టాండ్ పొట్టి శ్రీరాములు జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు బి.శ్రీరామూర్తి, సి.హెచ్.గోవిందరావు, టి.తిరుపతిరావు మాట్లాడుతూ సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటుచేసి, నిజనిర్ధారణ చేయాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక సంఘటనలపై పార్లమెంట్‌లో చర్చించాలని కోరారు. సాయుధ బలగాల ప్రత్యేక రక్షణ చట్టం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అమెరికాలోని న్యూయార్క్ ఈస్ట్రన్ డిస్ట్రిక్ట్ కోర్టులో అదానీపై అవినీతి కేసు నమోదయ్యిందని, విద్యుత్ ఒప్పందాల కోసం దాదాపు రూ.2100 కోట్లు మన దేశంలోని నాలుగు రాష్ట్రాల్లో అదానీ లంచాలుగా ఇచ్చినట్లు ఆరోపణలున్నాయన్నారు. ఇందులో 1750 కోట్లు మన రాష్ట్రంలోని గత ప్రభుత్వ హయాంలో ముడుపులుగా ముట్టచెప్పినట్లు తెలుస్తుందన్నారు. ఫలితంగా 25 ఏళ్లపాటు రాష్ట్ర ప్రజలపై లక్ష కోట్ల భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.కృష్ణ, లబ్బ రాజు, అప్పారావు, బాలకృష్ణ, ఆర్.పోలీసు, ఎం.చిట్టయ్య, అప్పలసూరి, రామారావు, గణేష్, రాజు, సత్యారావు పాల్గొన్నారు.




రణస్థలం మండల కేంద్రంలో జనసేన యువ నాయకులు గొర్లె సూర్య నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ ఉచిత అన్నదాన కార్యక్రమం మంగళవారం 342వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో శ్రీకాకుళం జనసేన అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, కార్యదర్శులు వడ్డాది శ్రీనివాసరావు, చిట్టి భాస్కరరావు, పంచాయతీ నాయకులు రవీంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు. **- సత్యంన్యూస్, రణస్థలం**




# రెవెన్యూ సదస్సులతో సమస్యల పరిష్కారం




(సత్యంన్యూస్, లావేరు)

రెవెన్యూ సదస్సులతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహశీల్దార్ వై.జోగారావు తెలిపారు. తామాడ గ్రామంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను ఈ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. అలాగే సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల టీడీపీ అధ్యక్షుడు ముప్పిడి సురేష్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను ప్రజలందరూ ఉపయోగించుకోవాలని అన్నారు. రెవెన్యూ సమస్యలు ఏమున్నా అధికారులు చుట్టూ తిరగకుండా, అధికారులే ప్రజల వద్దకు వచ్చి పరిష్కరించే విధంగా సదస్సులను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో రెవెన్యూ పాస్ పుస్తకాలపై జగన్మోహన్ రెడ్డి ఫోటో వేసుకునే వారిని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం రాజముద్రతో పాస్ పుస్తకం అందజేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీటీ తిరుపతిరావు, మండల సర్వేయర్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ గొర్లె శ్రీనివాసరావు, మండల టీడీపీ కార్యదర్శి పిన్నింటి మధుబాబు, టీడీపీ సీనియర్ నాయకులు కృష్ణంనాయుడు, వీఆర్వో కిరణ్మయి, పంచాయతీ కార్యదర్శి సుజాత, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



ఏపీ నుంచి బీజేపీ తరపున పోటీ చేసే అవకాశం కల్పించడంతో బీజేపీ రాజ్యసభ సభ్యునిగా బీసీ ఉద్యమ నేత ఆర్.కృష్ణయ్య నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు.

**- సత్యంన్యూస్, అమరావతి**

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.